క్లుప్తంగా

మోహన్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా

పెద్దవూర : మండలంలోని పర్వేదుల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ కాంట్రాక్టర్ పల్లా మోహన్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డిలు వేర్వేరుగా మృతుడు మెహన్ రెడ్డి ఇంటికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మోహన్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట నాయకులు వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా రథోత్సవం

చింతపల్లి : మండల పరిధిలోని వెంకటంపేట గుట్టపై కొలువుదీరిన శ్రీభవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల భాగంగా మంగళవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టపై శివాలయంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో మంగళ వాయిద్యాలతో రథాన్ని ఊరేగిస్తూ భక్తి గేయాలను ఆలపించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ యాదయ్య, కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, కొరివి యాదగిరి, రామారావు, కృష్ణమాచారి, గోవర్ధనచారి తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నివారణపై అవగాహన అవసరం

దేవరకొండ : టీబీ వ్యాధి నివారణపై అవగాహన అవసరమని వైద్యురాలు విజయ అన్నారు. మంగళవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీబీ నివారణ, జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం సంస్థ కృషి చేస్తుందన్నారు. టీబీ నిర్మూలన కోసం సిబ్బంది వైద్య, ఆరోగ్య శాఖ వారికి సహకరించాని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం సైదులు, వైద్యాధికారులు మనోహర్, సఫియాబేగం పాల్గొన్నారు.

కారోబార్ తండాలో పునరావాస సర్వే

కొండమల్లేపల్లి : పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంపుతో ముంపునకు గురవుతున్న మండల పరిధిలోని వడ్త్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్ తండాలో మంగళవారం జిల్లాకు చెందిన ఎస్టీసీ కార్యాలయం ఆర్‌ఐ అశ్విని ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తండాకు చెందిన పలువురు గిరిజనులు పునరావాసం పారదర్శకంగా జరగాలని, తండావాసులందరికీ నిబంధనల మేరకు నిధులు మంజూరు చేయాలని సర్వే అధికారులను కోరారు. తండాలో ఇప్పటికే 138 ఇళ్లకు సర్వే చేయగా మరో 23 మంది సర్వేలో తమకు అన్యాయం జరిగిందని, 21మంది స్థలం కొలతల్లో తేడా జరిగిందని ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తిరిగి సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. వీరి వెంట సర్వేయర్ రాంమూర్తి, కార్యదర్శి శిరీష, అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో అదనపు కలెక్టర్ పూజలు



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హాలియా : పట్టణంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. అనుముల మండలంలోని సెట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన మార్గమధ్యలో ఉన్న ఈ ఆలయాన్ని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ పాలక మండలి సభ్యులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న శివాలయం భూమి వ్యవహార వివాదంపై విచారణ జరపాలని ఆలయ చైర్మన్ చెరుపల్లి ముత్యాలు అదనపు కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కాకునూరి నారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రముఖ వ్యాపార వేత్త చిట్టిపోలు యాదగిరి, శివాలయ అధ్యక్షుడు ముత్యాలు, గౌనీ రాజా రమేష్‌యాదవ్, బాలకృష్ణ, ఈదయ్య, సీఎం రేవంత్‌రెడ్డి అభిమాన సంఘం అధ్యక్షుడు నాగయ్య, సైదులు, కేశవులు, పూరోహితులు రమణాచార్యులు, బీష్మాచారి పాల్గొన్నారు.

త్రిపురారంలో దొంగల భయం

- ట్రాక్టర్, ట్రాలీలు, బ్యాటరీలు, బైక్‌లు వ్యవసాయ మోటార్లు, ఆలయాలు, తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- ఉదయం రెక్కీ.. రాత్రి దొంగతనాలు
- గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ప్రజల వేడుకోలు

త్రిపురారం : మండల కేంద్రంతో పాటుగా గ్రామాలు, తండాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని రోజులుగా త్రిపురారం మండల కేంద్రంతో పాటుగా గ్రామాల్లో ఇళ్ల ముందు, పొలాల వద్ద పెట్టిన ట్రాక్టర్ ట్రాలీలు, బ్యాటరీలు చోరీకి గురువుతున్నాయి. దీంతో రైతులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. పగటిపూట, రాత్రి వేళల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. అయితే పగటి పూట రెక్కి నిర్వహించి రాత్రి వేళలో చోరీలకు పాలప్డుతున్నట్లు తెలుస్తోంది. పలు ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, గేదెలు సైతం అపహరణకు గురైన ఘటనలు ఉన్నాయి.

దొంగతనాల తీరు ఇలా..

బాబుసాయి పేటలో ఇంటి ముందు పెట్టిన బైక్, త్రిపురారంలో హోటల్ ముందు పెట్టిన బైక్ చోరీకి గురయ్యాయి. మండల కేంద్రంలో సాగర్ రోడ్డులో ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శివాలయంలో గుర్తు తెలియని యువకుడు నంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చి తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించాడు. అలాగే పెద్దదేవుల పల్లిలో లక్ష్మీనర్సిహస్వామి ఆలయంలో గుడి తాళాలు పగలగొట్టి స్వామి వారి నగలు దొంగిలించారు. నర్లకంటి గూడెంలో శ్రీ కోదండ రామచంద్రస్వామి దేవాలయం తాళాలు పగలగొట్టి అమ్మవారి పుస్తె మెట్టెలు, హుండీలో డబ్బులు ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంతో పాటుగా పలు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన స్టాటర్లు, సర్వీస్ వైర్లు, మోటార్లు, ఉద్యాన వన తోటల్లో డ్రిప్ పైపులు, స్ప్రింగర్లు దొంగిలిస్తున్నారు. బొర్రాయిపాలెం, రాజేంద్రనగర్, సత్యనారాయణపురం, నీలాయిగూడెంలలో గృహ అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన 25హెచ్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి ఆయిల్, కాపర్ వైర్లు దొంగిలించారు. బెజ్జికల్ గ్రామంలో రూ. లక్షా 30వేల ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురికాగా, ట్రాక్టర్ ట్రాలీలు, ఆఫ్ కేజీ వీల్సులు, ఫుల్ వీల్సులు దొంగిలిస్తున్నారు. పెద్దదేవుల పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా చోరీ జరిగింది. డొంకతండా గ్రామ పంచాయతీలో ఇస్లావత్ శివకు చెందిన మహింద్ర ట్రాక్టర్, ట్రాక్టర్ ట్రాలీ దొంగతనం చేశారు. దీంతో రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



విద్యుత్ మోటారు అపహరణకు గురైన పొలం

సీసీ కెమెరాలపై నిర్లక్ష్యం..

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. కాని త్రిపురారం మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను గుర్తించడం కష్టంగా మారుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఉండేవి కాని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొన్ని సీసీలు ధ్వంసం కాగా నిర్వహణ సరిగా లేకపోవడంతో మరికొన్ని సీసీలు పనిచేయడం లేదు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వ్యాపారస్తులు, ముఖ్య ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విదంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కానరాని పోలీస్ పెట్రోలింగ్

మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అధికంగా గిరిజన తండాలు ఉన్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక్క చోట దొంగతనాలు జరుగుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయితే గతంలో పోలీసులు రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించేవారు. కొన్ని నెలలుగా పోలీసులు గ్రామాలకు వెళ్లడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పొలం వద్ద మోటార్ ఎత్తుకెళ్లారు



మూడు రోజుల కిందట మా పొలం వద్ద ఉన్న వ్యవసాయ మోటారు గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. మోటారుకు రూ. 40వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్నాం. పొలం కాపాడుకోవడానికి మళ్లీ మోటారు కొనాల్సిన పరిస్థితి రావడంతో ఆర్థికంగా ఇబ్బందిపడాల్సి వస్తుంది. త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా.

– ఏళ్ల మహేందర్ రెడ్డి, రైతు, త్రిపురారం

ట్రాక్టర్ల బ్యాటరీలు పోతున్నాయి



గ్రామాల్లో ఇళ్ల ముందు పెట్టిన ట్రాక్టర్ బ్యాటరీలు గుర్తు తెలియని దుండగులు దొంగిలిస్తున్నారు. బండ్లు ఇళ్ల ముందు పెట్టాలంటే భయమేస్తుంది. చాలా మంది రైతుల ట్రాక్టర్ బ్యాటరీలు పోయాయి. టొక్క బ్యాటరీ విలువ రూ. 10 వేలు ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెలిసిన వ్యక్తిది హోటల్ ముందు పెట్టిన బైక్ కూడా పోయింది. ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– నగిరి శ్రీనివాస్, రైతు, త్రిపురారం

పరిశ్రమలకు వేరుగా విద్యుత్ సరఫరా చేయాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ఆసియా ఖండంలోనే అత్యధిక రైస్ మిల్లులు ఉన్న మిర్యాలగూడ పట్టణ ప్రజలకు, పరిశ్రమలకు వేర్వేరుగా విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా దామరచర్ల మండల పరిసర గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మండల కేంద్రంలో 50పడకల ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. నియోజకవర్గంలోని గిరిజనతండాల ప్రజలకు ప్రత్యేక ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఏప్రిల్ 15వరకు నీటిని విడుదల చేయాలన్నారు. అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల పరిసర అటవీ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకోని జీవిస్తున్న అర్హులైన రైతులందరికీ పట్టాలు అందించాలని కోరారు. రోడ్ల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ లింక్ రోడ్స్ ఏర్పాటు చేయడంతోపాటు మంజూరైన నాలుగు నూతన ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. వాడపల్లి, గణేష్‌పాడుల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. అదేవిధంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన గ్రామస్తులకు, రైతులకు ఆర్‌అండ్‌ఆర్ బాధితులకు త్వరగా ఉద్యోగాల పత్రాలు అందించాలని కోరారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

చింతపల్లి : గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఎలాంటి అవినీతి లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆడిషన్ పీడీ నవీన్ కుమార్ సూచించారు.మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 2023ఏప్రిల్ 1నుండి 2024–మార్చి 31వరకు మండలంలో రూ.3.31కోట్ల పనులకు గాను సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాలలో గత వారం రోజుల నుంచి సామజిక తనిఖీ బృందలాలు పర్యటించి గ్రామాలలో గతంలో జరిగిన ఉపాధి పనులను గుర్తించినట్లు తెలిపారు. ఉపాధి హామీలో ఎలాంటి అవకతవాకలు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలావుండగా ఉపాధి హామీ సామజిక తనిఖీ తూ తూ మంత్రాంగానే జరిగిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణు గోపాల్, దేవరకొండ క్లస్టర్ ఈపీడీ డాక్టర్ యామిని, క్యూసి పసివుద్దిన్, ఎంపీడీఓ సుజాత, ఏపీఓ శౌరిరెడ్డి, ఈసీ సుమీర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

త్రిపురారం : నిడమనూరు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు కొండేటి శ్రీను అన్నారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు పలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోటేష్, గురువయ్య, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

వేములపల్లి(మాడుగులపల్లి) : సీపీఎం ప్రజాపోరు బాట కార్యక్రమంలో భాగంగా తోపుచర్లలో ఇంటింటి సర్వే సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ నిర్వహించారు.

మూల్యాంకన నిధులు విడుదల చేయాలి

హాలియా : ఈనెల 21 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో 2024 సంవత్సరంలో ఎస్ఎస్‌సీ పరీక్ష పేపర్లు మూల్యాంకన చేసిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యూనరేషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచమల్ల రమాదేవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు చింతపలి రవీందర్, సయ్యద్ మియా పాల్గొన్నారు.

మూల్యాంకన రెమ్యూనరేషన్ చెల్లించండి

కొండమల్లేపల్లి : 2023–2024 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పటికైనా ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసచారి డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకు గాను ఈనెల 20న నిర్వహించనున్న డీఈఓ కార్యాలయ ఎదుట నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ సభ్యులు సపావత్ భానుప్రకాష్, శ్రీదేవి, కోడి నరేందర్, శోభారాణి, నజీరుద్దీన్, నాగార్జున, సుధాకర్, డి.కోటయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి

- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ చివరి ఆయకట్టు వరకు నీరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడెం సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని డీ 25 కాల్వను పరిశీలించి ఆయకట్టు చివరన గల మారేపల్లి ప్రాంతానికి నీరు చేరేలా తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. 18 కిలోమీటర్ల పొడవునా డీ–25 కాల్వలో చివరి ఆయకట్టుకు నీరందించేందుకు కాల్వ ప్రారంభం నుంచి రైతులు అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న గండ్లు, పైపులనన్నింటినీ తొలగించాలని, అడ్డుపడితే పోలీసులు కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా అధికారులు తీసుకున్న చర్యలతో ఎట్టకేలకు మంగళవారం సాయంత్రానికి మారేపల్లికి నీరు చేరింది. అక్కడి పంట పొలాలను కాపాడేందుకు రాత్రివేళ కూడా కాల్వ వెంబడి సిబ్బంది కాపలా కాస్తూ మరోవారం రోజులు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. సబ్‌కలెక్టర్ వెంట గుర్రంపోడు డివిజన్ ఈఈ నెహ్రూనాయక్, డీఈఈ పరమేష్, సురేష్‌కుమార్, ఏఈ శ్రీనివాసరావు, చంద్రప్రకాశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గుర్రంపోడు : డీ 25 కాల్వను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

ఏఎమ్మార్పీ డీ 25 కాల్వ పరిశీలన

హాలియా : అనుముల మండలంలోని మారేపల్లి సమీపంలో డీ 25 కాల్వను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మంగళవారం పరిశీలించారు. తుర్కపల్లి నుంచి మారేపల్లి గ్రామాల వరకు డీ 25 కాల్వ చివరి భూములకు నీరు ఎలా వెళ్తుందో అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతులు కాల్వకు అడ్డుకట్టలు వేసి నీటిని మళ్లించుకుపోవడంతో చివరి భూములకు నీరందక 50ఎకరాలకుపైగా పొలాలు ఎండిపోయాయని రైతులు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ సుజాత, ఇరిగేషన్ శాఖ ఈఈ నెహ్రూ, డీఈ పరమేష్, ఇంచార్జ్ తహసీల్దార్ రఘు, ఏఓ సరిత, రైతులు , తదితరులు పాల్గొన్నారు.

పొలాలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలి

వేములపల్లి(మాడుగులపల్లి) : పంటలు ఎండిపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాడుగులపల్లి మండలంలోని గుర్రప్పగూడెంలో పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఎండిపోయిన పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం డీ 40 కాల్వ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో గ్రామంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేసి రైతులకు పంటల బీమాను వర్తింపజేసి ఆదుకోవాలన్నారు. అదేవిధంగా డీ 40 కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడుకుంట్ల సాయన్న, నాయకులు బొమ్మకంటి నరసింహా, దశరథ, కడియం సైదులు, నాగరాజు, పల్నాటి రాంరెడ్డి, పోరెడ్డి సత్యనారాయణరెడ్డి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదంపై హర్షం

హాలియా : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడం హర్షణీయమని ఏకే ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా స్థానిక సంస్థలు, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రంలో గొప్ప విప్లవం రాబోతుందన్నారు.

బీసీ కులగణన చరిత్రాత్మక నిర్ణయం

త్రిపురారం : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన చరిత్రాత్మక నిర్ణయమని నల్లగొండ జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. మంగళవారం త్రిపురారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రికి వినతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతి పత్రాన్ని బీసీ సంఘం నేతలు అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, తెలంగాణ విద్యార్థి, యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం నేత గోదా రవీందర్, చంద్రమోహన్ తదితరులున్నారు.

కనీస వేతనం ఇవ్వాలి : ఆశావర్కర్లు

మిర్యాలగూడ అర్బన్ : అతి తక్కువ వేతనంతో ఏళ్ల తరబడి పని చేస్తున్న తమకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, ఆశా వర్కర్లు స్వర్ణ, రాజేశ్వరి, రమాదేవి, మాదవి, రాజు, మంగతాయి, శ్రీలత, మల్లేశ్వరి, రజి, అనిత, లోకేశ్వరి, రాణి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చేయూతనందించడంలో నిడమనూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి అన్నారు. మంగళవారం త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంపాసాగర్ గ్రామ పరిదిలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నిడమనూరు లయన్స్ క్లబ్ ఆర్థిక సహకారంతో పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిదులు కోప్పోజు శ్రీనివాస చారి, శ్రీనివాస్, డేవిడ్, చిత్రం అశోక్, మేక సత్తి బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ అందజేత

పెద్దవూర : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం గుడిపల్లి మండల కేంద్రానికి చెందిన సీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ తరి రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఫౌండేషన్ సభ్యులు శ్యాం, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రమాదేవి, రూపారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

మిర్యాలగూడ అర్బన్ : అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా బీఆర్ఎస్ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.షోయబ్ మాట్లాడారు. అరెస్టు అయిన వారిలో మహేష్‌నాయుడు, హరిక్రిష్ణ ఉన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

దేవరకొండ : ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమ నేపథ్యంలో పలువురు బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి దేవరకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, మధు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

త్రిపురారం : 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సాగర్ నియోజక వర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అర్హులైన యువత ఓటు హక్కు పొందే విధంగా గ్రామాల్లో రాజకీయ పార్టీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటరు కార్డులో పేరు ఉండి చనిపోయిన వారు, ప్రాంతం మారిన వారి ఓట్లు, పెళ్లి చేసుకున్న వారి ఓట్లు ఎన్నికల కమిషన్ నిబంధలన ప్రకారం తొలగించనున్నట్లు తెలిపారు. ఓటరు లిస్ట్‌ల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్నా రాజకీయ పార్టీల నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఓటరు లిస్ట్‌ల నిర్వహణలో అధికారులు ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని, ఎన్నికల విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్పులు చేర్పులకు సహకరించాలి

మిర్యాలగూడ : ఓటరు జాబితా ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా మార్పులు చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో రోజువారీగా ఓటరు నమోదు అవుతున్న ఫాం–6,7,8ల పరిష్కారం, డూప్లికేట ఓటర్ల తొలగింపు, బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై మంగళవారం సబ్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్, సురేష్, పుష్పలత, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, జేఏ ఫణి, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బాలు, నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, పందిరి అనిత, పాతూరి శరత్, రవినాయక్, వెంకటేశ్వర్లు, శ్రీనునాయక్, సత్యప్రకాశ్, సయ్యద్‌ఫారుఖ్, దినేష్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

దేవరకొండ : ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పిదాలు, సవరణలు ఉంటే సవరించుకోవాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఆయా అంశాలపై ఓటర్లపై చైతన్య పర్చాలన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ అధికారులున్నారు.

పన్ను చెల్లించని దుకాణాలు సీజ్



పన్ను చెల్లించని షాపుకు తాళాలు వేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం బకాయిదారుల స్పందించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది వెళ్లి పోలీసుల సహకారంతో షాపులకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ విషయాన్ని తెలసుకొని కొందరు బకాయిదారుల ముందుగాను షాపులను మూసివేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీలు మాట్లాడుతూ మున్సిపాలిటీలో వంద వరకు మొండి బకాయిలు ఉన్నాయని, వాటికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు ఇచ్చి 20 రోజులు అవుతున్నప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సిబ్బందితో కలిసి తాళాలు వేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మొండి బకాయిదారులు ఏళ్ల తరబడి కట్టకుండా ఎగవేస్తుండడంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీరి ద్వారా రెండు కోట్ల 34లక్షల 83 వేల రూపాయలు వసూలు కావాల్సి ఉందన్నారు. ఈ నెల 31వ తేది వరకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. అయితే వడ్డీ రాయితీ కల్పించాలని బకాయిదారులు కోరుతుండటంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు సాంబయ్య, సాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీపీఓ అంజయ్య, అబ్దుల్ శహాబాజ్, రమేష్‌లతో పాటు పలువురు సిబ్బంది తదితరులున్నారు.

కొనసాగుతున్న పెద్దమ్మతల్లి జాతర

పెద్దవూర : రెండేళ్లకొకసారి నిర్వహించే గిరిజనుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి జాతరను మండలంలోని పిన్నవూర, నాయినివానికుంటతండా, ఎర్ర కుంటతండాలలో మంగళవారం ఘనంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం వేకువ జామునుంచే జాతర వద్ద భక్తుల తాకిడి ఎక్కువైంది. దేవాలయ పరిసరాల్లో వరి పొలాలను రైతులు సాగు చేయడంతో భక్తులు తమ వాహనాలను నిలిపి ఉంచడానికి, వంటలు చేసుకోవటానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట పొలాలతో దేవాలయం వద్దకు దారి కూడా ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేవాలయం పూజారులు దేవుడు బావోజీ, రవినాయక్ సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర వద్ద దేవాలయానికి ఎదురుగా నిలిపి ఉంచిన ప్రభలు పలువురిని ఆకట్టుకున్నాయి. రంగు రంగుల వస్త్రాలు, కాగితాలతోనూ, దేవుళ్ల పటాలను ఉంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలలో ప్రభలను భక్తిశ్రద్ధలతో తయారు చేసి గ్రామాల్లో ఊరేగింపు చేసుకుని వచ్చి దేవాలయం చుట్టూ ప్రదిక్షణలు చేసి దేవాలయం ఎదురుగా వరుస క్రమంలో నిలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఆంగోతు భగవాన్‌నాయక్, నాగరాజు, మునినాయక్, పాండునాయక్, రాంబాబు, వినోద్, హాతీరాం, రాముూనాయక్, లాలోజీ, తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్లపై జాతరకు తరలివస్తున్న భక్తులు

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపిక

అడవిదేవులపల్లి : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షా ఫలితాల్లో అడవిదేవులపల్లి గ్రామానికి చెందిన బండి మధు రాష్ట్ర స్థాయిలో 92వ ర్యాంకు సాధించాడు. జోనల్ స్థాయిలో 26వ ర్యాంకు సాధించి వార్డెన్ ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిదులు ప్రత్యేకంగా అభినందించారు.



మధు, అడవిదేవులపల్లి



అక్షిత పెద్దవూర

పెద్దవూర : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా మండలంలోని పొట్టివానితండాకు చెందిన రమావత్ అక్షిత ఉత్తమ మార్కులు సాధించి ఉద్యోగం సాధించింది. తన చిన్నతనంలోనే ఆలనాపాలనా చూసుకునే తండ్రి నాగేశ్వర్‌రావు మృతి చెందడంతో మానసికంగా ఇబ్బంది పడింది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలో 300 మార్కులకు గాను 189 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 440వ ర్యాంకు, ఆరో జోన్‌లో 120వ ర్యాంకు, ఎస్టీ మహిళా విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించి బీసీ వెల్ఫేర్ ప్రీమెట్రిక్ హాస్టల్‌లో వార్డెన్‌గా ఉద్యోగం సాధించింది. దీంతో తండావాసులు, కుటుంబసభ్యులు, స్నేహితులు అక్షితను అభినందించారు.